# నిజం

రామనాథం యింట్లో అడుగుపెట్టే సమయానికి పక్కవాటాలోంచి కేకలు, బొబ్బలు, చిన్నపిల్లలు ఏడుపులు వినిపిస్తున్నాయి. రామనాథం పార్వతిని పిలిచి....

"ఏవిటి! ఏం జరిగిందీ?" అన్నాడు.

"మరేమో? ఆ పిల్లాడు ఎంతపని చేశాడనుకున్నారూ" అంటూ అసలు విషయం చెప్పకుండా పార్వతి సాగతీస్తుంటే అతనికి చిరాకేసింది. కాని విషయం తెలుసుకోవాలనే వుత్సాహంలో -

"ఏం చేశాడేం?" అన్నాడు మళ్ళీ.

"అలమారులో పదిరూపాయలు పెడితే, అవి తీసుకు వెళ్ళి ఏవో కొనేసుకున్నాట్ట. డబ్బంతా తీసుకుని మిఠాయిల వాడు రెండు మిఠాయిలు పెట్టి పంపాడుట. ఇప్పుడే చూసుకున్నారు. రామరామ - ఆ పిల్లాడిని అలా కొడుతున్నారు గంటనుండీ.

పార్వతి ఒగరుస్తూ కథ ముగించింది. రామనాథం అటూ యిటూ పచార్లు చేస్తూ బట్టలు మారుస్తూ పక్క యింట్లోంచి వచ్చే మాటలు, ఏడుపులు, దెబ్బలు వింటున్నాడు. ఆ పిల్లాడిని కొడుతుంటే మిగిలిన పిల్లలు ఘొల్లుమన్నారు. భార్య అడ్డుపడుతూ పిల్లాడిని తిడుతూ ఏడుస్తోంది.

వీళ్ళనీ, వాళ్ళనీ అడగ్గా ఆ పిల్లాడు మిఠాయి బండిలో ఏవో కొనుక్కుంటుంటే చూశామని చెప్పారు.

కాని ఎంత డబ్బు యిచ్చాడో మాత్రం ఎవ్వరూ చూడలేదు. అయినా ఆ బండి వాడికే యిచ్చి వుండాలని అందరూ నిర్ధారణ చేశారు. ఆ బండిని, బండివాడినీ గుర్తు పట్టగలమని కొంతమంది భరోసా కూడా యిచ్చారు.

ఆ పిల్లాడు చేతినిండా వాతలతో వీపునిండా చేతి గుర్తులతో సన్నగా ఏడుస్తూ వరండాలో పడుకున్నాడు. రామనాథం వాడి దగ్గరకెళ్ళి చూశాడు. వొళ్ళు వేడిగా వుంది.

రేపు ఉదయం పది పదకొండు గంటలప్పుడు ఆ మిఠాయి బండి వస్తుందనీ, అప్పుడా విషయం తేల్చి పది రూపాయలు దక్కించుకోవాలని భార్యా, భర్తలు ఆ నాటికి పిల్లాడిని కొట్టడం ఆపారు. ఆవిడ మాత్రం అందరి దేవుళ్ళకీ మొక్కింది. ఆ బండి వాడిని నానా శాపనార్థాలు పెట్టింది. పిల్లాడికిది స్వంతంగా వచ్చిన బుద్ధి కాదనీ, ఎవరో చెపుతున్నారనీ, వెనుక వుండి యిలా చేయిస్తున్నారనీ, తన కొడుకు లక్ష వరహాలు ఎదురుగా పెట్టినా ముట్టుకునే రకం కాదనీ చాటింది. సహవాసాలు అలాంటివి అని వాపోయింది. అందర్నీ కలిపి తిట్టింది ఆ రోజు భోజనం మానేసింది.

తెల్లవారితే ఆదివారం అనగా ఆ యింట్లో అంతా నిశ్శబ్దంగా, విచారంగా గడిచిపోయింది. ఎలా తెల్లవారిందో ఏం జరిగిందో మరునాడు లేస్తూనే ఆమె కాఫీలు మాత్రం పూర్తిచేసి వీధి అరుగుమీద కూర్చుంది.

ఆ బండివాడి కోసం నిన్న గుర్తుపట్టగలనన్న పదేళ్ళ పాపని కూడ తీసుకొచ్చి తన పక్కన కూర్చోపెట్టుకుని వీధి అందరికీ జరిగిన విషయాన్ని వివరించడం మొదలెట్టింది.

రామనాథం కాఫీ తాగి వరండా మీదకి చేరాడు.

తొమ్మిదిన్నర కావస్తోంది. ఎండ చుర్రుమంటోంది. ఆ యిల్లాలు మాత్రం అలాగే అరుగుమీద కూర్చుని ఆ మాటా యీ మాటా చెప్తూ ఆ గుర్తు పట్టగలనన్న పిల్లని వెళ్ళిపోకుండా కాపాడుకుంటోంది. తన కొడుకుని కూడా దగ్గరగా కూర్చోపెట్టుకుని వుండి వుండి వాడ్ని తిడుతూ, అక్కడికీ కోపం తీరక ఒక మొట్టికాయ వేస్తోంది. మిగిలిన పిల్లలు ఆకలిగా వుందో ఏమో అటూ యిటూ బిక్క ముఖాలేసుకుని తిరుగుతున్నారు. ఇంతకీ చిత్రం ఏమిటంటే ఆ ఇంటాయన మాత్రం స్థిమితంగా కుర్చీలో కూర్చుని ఏదో ఇంగ్లీషు నవల చదువుకుంటున్నాడు. ఆయన్ని చూస్తే "ఈయనేనా నిన్న పిల్లాడ్ని చావబాదినవాడు" అనిపించింది. నుదుటిమీద చెమట కొంగుతో తుడుచుకుంటూ సూటిగా వీధి చివరికి చూస్తోంది ఆమె. రామనాథానికి ఆశ్చర్యం వేసింది. ఆ యిల్లాలు ఏవిధంగానైనా ఈ విషయం సాధించి తీరుతుంది అనుకున్నాడు.

అసలు యింతకీ ఆ కుర్రాడు పదిరూపాయల నోటు బండివాడికి యిచ్చాడో లేదో - వాడు మళ్ళీ ఇటు వస్తాడా? వచ్చినా వీళ్ళ డబ్బు తీసుకున్నానని ఒప్పుకుంటాడో ఒప్పుకోడో.

పదిన్నర కావస్తోంది. దూరంగా గంట మ్రోగిస్తూ వస్తున్న జయపూర్ స్వీట్సు బండిని చూడగానే ఆ పదేళ్ళ పిల్ల చెంగున లేచి "అదిగోనండి అత్తయ్యగారూ ఆ బండి వాడే. అందులోనే కొన్నాడు మన రాము మిఠాయి" అంటూ అరిచింది. నిరీక్షిస్తున్న ఆ యిల్లాలు, ఇంట్లోకి పరుగుపెట్టి ఆయన చేతిలో పుస్తకం లాక్కుని పక్కనపెట్టి "ఏవండీ ఆ బండివాడు వస్తున్నాడు. కాస్త దబాయించి అడగండి" అంది.

పిల్లలంతా గలగలమని బయటకి వచ్చారు. రామనాథం ఉత్సుకతతో గేటు దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

పక్కింటాయన చేతిలో ఉన్న పుస్తకం క్రిందపెట్టి లుంగీ గట్టిగా కట్టుకుని బయటకు తొంగిచూశాడు. పిల్లలు గోలగా అరుస్తూ ఉండడంతో చుట్టుపక్కల యిళ్ళలోని వాళ్ళు కూడా బయటకి వచ్చారు - మొత్తానికి.

భార్యా భర్తలు ఇద్దరూ ఆ బండికి ఎదురు వెళ్ళి అతన్ని పట్టుకున్నారు.

"ఏంవయ్యా నిన్న చిన్నపిల్లాడిని చేసి పదిరూపాయల కాయితం తీసుకుంటావా? నడు - ముందు పోలీస్ స్టేషన్‌కి నడు" అంటూ కేకలు వేయటం మొదలుపెట్టాడు యింటాయన.

"చూడు నాయనా! పాపిష్టి డబ్బుకోసం నువ్వు అలా చేశావు కానీ నా బిడ్డ ఎన్ని దెబ్బలు తిన్నాడో చూడు ఇలా చూడు. తెలియక పిల్లాడు పదికాయితం తెస్తే మాత్రం తీసుకుంటావూ ఆ విధంగా సంపాదించిన డబ్బు ఏం నిలుస్తుంది బాబూ! నిలవదు నాయనా! ఈ డబ్బు ఇవాళ వుంటుంది రేపు పోతుంది. న్యాయంగా బ్రతకాలి. అన్యాయం ఎన్నాళ్ళో నిలవదు" అంటూ ఆమె గ్రుక్క తిప్పుకోకుండా నీతులు వల్లిస్తుంటే, తెలుగు భాష బాగా తెలియని ఆ మార్వాడీ కుర్రాడు నోరు తెరిచి చూస్తున్నాడు. అతనికి అర్థమైంది అంతే పది రూపాయల కాగితం తను తీసుకున్నట్లు అంటున్నారు. అంతే తెలిసింది. మిగిలిన పెద్ద పెద్ద మాటలు అతనికి అర్థం కావటంలేదు.

"ఏయ్! ముందు పదిరూపాయలు ఇక్కడ పెట్టు లేకపోతే నిన్నూ నీ బండిని పోలీస్ స్టేషన్‌లో పెట్టిస్తా." ఆయన గట్టిగా అరిచాడు.

"నాకు మీరు చెప్పిన మాటలు తెలియదు మా నాయనగార్ని తీస్కువస్తా" అన్నాడు.

"మళ్ళీ వస్తావా నాయనా, మా మంచివాడవు నిన్ను వదిలితే మళ్ళీ ఎందుకు వస్తావు?" అంటూ ఆ యిల్లాలు బండిని గట్టిగా పట్టుకుంది.

"బండిని తీసుకుపోను తల్లీ, మీకాడ పెట్టండి నేను పోయి వస్తాను" అంటూ ఆ కుర్రవాడు బండిని ముందుకు పోనిచ్చి వాళ్ళింటి ముందు ఆపాడు. రామనాథం ఇంకా చుట్టుపక్కలవాళ్ళు బండీచుట్టూ చేరారు. ఆ కుర్రాడు బండికి తాళంవేసి గుంపులోంచి బయటపడ్డాడు.

"దొంగ వేషాలు! తీసుకునేటప్పుడు లేదుగాని - యివ్వాల్సివస్తే తండ్రిని తీసుకువస్తాట్ట" ఒకరి విమర్శ.

"ఏమోలెండీ! భాష తెలియదనుకుంటా, పైగా కుర్రాడు." ఒకరు సానుభూతి చూపించారు.

"అసలు ఆ కుర్రాడు కొన్నది ఈ బండిలోనేనా?" అన్నారు మరొకరు అనుమానంగా-

"ఆ.... ఆ.... ఇదే మేము చూశాంగా" గుంపులోంచి రెండు మూడు కంఠాలు వినిపించాయి. రామనాథం ఆలోచిస్తూ నిలబడ్డాడు. ఆ మార్వాడీ కుర్రాడికి పదహారేళ్ళు వుంటాయి. తెల్లగా, అందంగా, అమాయకంగా అతనిలో యింత కృత్రిమం లేదేమో అనిపించేలా వున్నాడు. మరి యింతమంది కూడీ ఆ బండివాడికే యిచ్చాడని అంటున్నారు ఏమో! పది నిముషాలు గడిచేలోపు ఆ కుర్రాడు తండ్రితో సహా వచ్చాడు.

"ఏమిటండీ గొడవ - వాడికి ఎవ్వరూ పదిరూపాయలు యివ్వలేదు. యిస్తే మేము అన్యాయం ఎప్పుడూ చెయ్యం -"

"చాల్లేవయ్యా ఆ పిల్లాడు కొనుక్కుంటుంటే యింత మంది చూశారు. కాదనగానే సరా" అందుకున్నాడు.

ఆ యిల్లాలు ముందుకొచ్చి "నేను నాయనా! పది రూపాయలు బొగ్గులకి యివ్వాలని గూట్లో పెట్టి పనిచేసుకుంటూ వున్నాను. ఆ బొగ్గులవాడు రాలేదు. నేను మళ్ళీ మర్చిపోయాను ఒక గంట పోయి చూసుకుంటే ఏముంది?"

"మాకు యివ్వలేదమ్మా యింకెక్కడైనా పారేసి నాడేమో అడగండి" అన్నాడా వ్యాపారి.

"ఇందులోనే కొంటుంటే మేము చూశాము గదయ్యా" ఒకాయన ముందుకొచ్చి దబాయించాడు.

చుట్టూ మగాళ్ళంతా చేరారు. ఆ వ్యాపారి ఏమనుకున్నాడో ఏమో!

"ఈ దేశంలో మా వ్యాపారం లేని వూరంటూ లేదు. ఇలాంటి అన్యాయాలు చేస్తే మేమేం వ్యాపారం చెయ్యగలం సార్, మీరే చెప్పండి" అన్నాడు నలుగుర్నీ చూస్తూ.

రామనాథానికి అతని మాటల్లో నిజం వున్నట్లు అనిపించింది. కాని ముందుకు వచ్చి ఏమీ మాట్లాడలేక పోయాడు. ఏదో పిరికితనం అతన్ని ఆవహించింది. అతని మనసుకి మాత్రం అనిపించింది. ఆ వ్యాపారి చెప్పింది నిజమని దానికి సాక్ష్యం లేదు. వీధి వీధంతా ఏకమై ఒక్కుమ్మడిగా చేస్తున్న ఆరోపణ కాదనే ధైర్యం అతనిలో లేకపోయింది.

ఇంతలో ఆ యిల్లాలు ఒక అడుగు ముందుకు వేసి "నాయనా! నువ్వు నమ్మినా నమ్మకపోయినా వెంకటేశ్వర స్వామిమీద ఒట్టువేసి చెప్తున్నాను. నేను పదినోటు ఇంట్లో గూట్లోపెట్టాను. ఈ కుర్రవెధవ తీశానంటున్నాడు. వీడు నీ దగ్గర మిఠాయి కొంటుంటే చూశామని యింతమంది చెప్తున్నారు. ఇంకేం చెప్పను? నేనెందుకు అబద్ధం చెప్తాను-! చెప్పు" అంది. ఆ వ్యాపారి ఒక్కసారి ఆమెకేసి చూసి జేబులోంచి పదిరూపాయల నోటు తీసి -

"ఆ అమ్మగారు చెప్పారు గాబట్టి యిచ్చేస్తున్నా. కాని యిది నిజంగా నాకు నష్టం. మాకు ఇలాంటి రిమార్కు రాకూడదు. అందుకని యిస్తున్నాను. మరొక్కసారి చెప్తున్నా యిది నాకు నష్టం. నేను తీసుకోకుండా యివ్వడమే" అన్నాడు -

స్వీట్సుబండి ముందుకు కదిలింది. జనం నలుమూలలకి చెల్లా చెదురైపోయారు. రామనాథంకి ఎందుకో నిజం ఓడిపోయినట్లనిపించింది.

❖ ❖ ❖

రామనాథం విసుగ్గా నడుస్తున్నాడు. రాత్రి బాగా పొద్దుపోయింది. వూరంతా నిశ్శబ్దంలో మునిగి వుంది టైము పదకొండు కావస్తుంది. రామనాథం నడిచే రోడ్డుమీద పూర్తిగా జన సంచారం లేదు. దూర దూరంగా వీధిలైట్లు వెలుగుతున్నాయి. అతని మనసులో పొద్దున జరిగిన సంఘటనతో అలజడిగా వుంది. నాలుగురోజుల క్రితం జరిగిన మిఠాయి బండివాడి గొడవ కూడా మనసులో మెదులుతోంది. అతను కూడా తనలాగే నిజాన్ని నిరూపించుకోలేక బాధ పడ్డాడేమో. తను నిర్దోషిగా నిరూపించుకోలేక పోతున్నందుకు రామనాథం హృదయం అవమానంతో అసమర్థతతో కృంగిపోతోంది.

మరునాడు ఉదయం ఏడుగంటలకి యింటిదగ్గిర బయలుదేరి, బస్సుకోసం అరగంట వేచి చివరికి కష్టపడి బస్సును పట్టుకున్నాడు అతను. విపరీతమైన జనంతో కిక్కిరిసి వుండటం వల్ల రామనాథం చాలా కష్టపడి లోపలికి ఎక్కాడు. బస్సు కదిలింది. కండక్టరు టిక్కెట్లు యివ్వడం మొదలు పెట్టాడు. ఎవరు ఎంత డబ్బు యిస్తున్నారో. ఎవరు టిక్కెట్టు అడుగుతున్నారో కూడా వినలేనంత గొడవగా వుంది. రామనాథం రెండు రూపాయల నోటుతీసి కండక్టరుకి యిచ్చి టికెట్ అడిగాడు. దాని ఖరీదు ముప్ఫై పైసలు. పదినిముషాలు గడిచినా కూడా అతని టికెట్ రాలేదు. రామనాథం టిక్కెట్టు యిమ్మని అడిగాడు.

"డబ్బులివ్వండి" అన్నాడు కండక్టరు.

"ఇచ్చాను కదయ్యా"

"ఎప్పుడండీ? నాకివ్వలేదు, సరిగ్గా చూసుకోండి."

"కాదు, యిచ్చాను రెండు కాగితం, నువ్వే సరిగ్గా చూడు" రామనాథం కొంచెం గట్టిగానే అన్నాడు.

"ఏంటయ్యా ఇవ్వలేదంటుంటే – త్వరగా డబ్బులు తియ్యి, టిక్కెట్టు యిస్తా"

రామనాథం ఏం చెయ్యటానికి తోచక నిశ్చేష్టుడయి వుండిపోయాడు.

ఈ గొడవ వినడం కోసం బస్సులో కొత్త గోల తగ్గింది.

"సరిగ్గా చూడవయ్యా" అన్నాడొక పాసింజరు.

"చూశాను సార్, మాకు తెలుస్తుంది. ఎవరిచ్చారో ఎంత జనం వున్నా" కండక్టరు ధీమాగా పలికాడు.

రామనాథం ఆశగా నలువైపులా చూశాడు. ఎవరూ పలకలేదు ఏమో ఎవరు చూశారో నేను చూడలేదు" అన్నాడు చివరికి చేసేది లేక.

"ఒకటి రెండుసార్లు అడిగి మరీ చేతిలో పెట్టాలి డబ్బులు! జనం ఎక్కువగా వున్నప్పుడు కష్టం" ఎవరిదో సలహా.

రామనాథం గొంతులో దుఃఖం నిండింది. చేసేది లేక మరొక రూపాయి నోటు యిచ్చి టికెట్ కొన్నాడు.

"మొదట ఇచ్చిన వాడయితే మళ్ళీ ఎందుకివ్వాలి? తనిచ్చినట్లు నిరూపించు కోవాలి" ఒక కాలేజీ విద్యార్థి అనుమానాస్పదమైన విమర్శను విసిరాడు.

"అఁ – ఏదో టోకరా వేద్దామనుకున్నాడు. తీరా చూస్తే సాగలేదు"

రామనాథం మనసూ శరీరమూ అవమానంతో కృంగిపోయాయి - సాక్ష్యం అనేది లేకపోతే నిజం అబద్ధంగా రుజువౌవుతుంది. తను మళ్ళీ డబ్బులివ్వడం ద్వారా దోషిగా నిరూపించుకున్నాడు రామనాథం మనస్సు నిస్పృహతో నీరసంగా అయిపోయింది. బస్సులో ప్రతివారి చూపులు సూదులై తన శరీరాన్ని గ్రుచ్చుకుంటున్నట్లు అనిపించింది. తను దిగవలసిన స్టాప్ రాగానే ఒక్క వుదుటున క్రిందికి దిగేశాడు. రోజంతా మనసంతా ఎలాగో అయింది. నెలాఖరు సమయంలో పోయిన రెండు రూపాయల కంటే బస్సులో పోయిన పరువుకు ఎక్కువ మధనపడ్డాడు.

❖ ❖ ❖

ఈ సంఘటన మనసులో మెదలుతుండగా రామనాథం మెల్లగా నడుస్తున్నాడు ఆ సాయంత్రం ఎక్కడా జనంలేరు. అప్పుడప్పుడు ఒక్కొక్క లారీ వేగంగా పోతోంది. రామనాథం యింటికి చేరాలంటే బస్సుదిగి రెండు మూడు ఫర్లాంగులు నడవాలి. అతనికి వెనకాల ఎవరో యిద్దరు కుర్రాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ గట్టిగా నవ్వుకుంటున్నారు.

"ఆయాల బలే గమ్మత్తు జరిగినాదిలే -" అన్నాడు ఒకడు.

"ఏం జరిగిందేటి?" ప్రక్కవాడి ప్రశ్న.

"మద్దాన్నం పన్నెండు గంటలవుద్ది. ఎండ సర్రున కాల్తోంది. నేనటు మా అవ్వకాడికి పోయాను. ఒక కుర్రోడు సాలా సిన్నోడులే ఏడేళ్ళుంటాయి పదిరూపాయల కాయితం పట్టుకుని పోతున్నాడు."

"ఆరినీ... అది కాస్తా కాజేసినావా?"

"ఇను, నేను సెప్పేది ఇనూ"

"నేనా కుర్రోడి దగ్గరకు పోయి ఏంటి బాబు ఏం కావాలి? అంటూ నా జేబులోని రెండు ఏర్చెనక్కాయలు ఉంటే పెట్టాను."

"మిఠాయి కొట్టుకి. కొనుక్కుందామని" అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

"దా - బాబూ నే కొనిపెడతా" అంటూ చెయ్యి పట్టుకున్నాను. నాతో నడవటం మొదలుపెట్టాడు. డబ్బులు యియ్యమన్నాను ఇచ్చాడు. శానా దూరంపోయినా కొట్లు కనిపించలేదు. ఆ కుర్రోడిచ్చిన పదినోటు జేబులో యేసుకుని ఒక రూపాయి ఆడిచేతిలో పెట్టా, ఆణ్ణి అక్కడే వదిలేద్దామనుకున్నా. కానీ ఆడికి అక్కడనుండి ఇంటికి పోవడం కూడా తెలవదని ఆళ్ళ సందు వరకు తీసుకువచ్చా. ఆ సందులోనే ఒక మిఠాయిబండి

పోతావుంటే "బాబూ అందులో కొనుక్కో బావుంటుంది" అన్నాను ఆ కుర్రోడు పరుగుతీశాడు. నేను ఎవ్వరూ చూడకుండానే యింటికొచ్చా.

రామనాథం ఆశ్చర్యానికి అంతులేదు. "ఆ రోజు మిఠాయి బండివాడు పది రూపాయలు నష్టపోయి పరువుకోసం యిచ్చాడు. ఈ రోజు తనూ అలాగే పరువుకోసం రెండుసార్లు డబ్బులిచ్చాడు. కానీ అతని పరువూ, తన పరువూ కూడా నిలవలేదు. నిరూపించ లేకపోతే నిజం అబద్ధంగా మారుతుందా. మారదుగాని అబద్ధం అనే ముసుగులో నిజం కొన్నాళ్ళు మరుగుపడాల్సి వస్తుంది అనుకున్నాడు రామనాథం.

వెనక్కి తిరిగి ఆ కుర్రాళ్ళకేసి చూశాడు. దూరంగా వున్నవాళ్ళు అక్కడే వున్న చిన్న టీ కొట్లోకి వెళ్ళారు.

('స్వాతి' మాసపత్రిక నుండి)